ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 7 ఏప్రిల్ 2025


సూగూరు ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఉట్లమాను ఎక్కుతున్న యువకులు


గోరంట్లలో రాతిదూలం లాగుతున్న వృషభాలు


కరావులపల్లిలో ఎద్దుల బండ్ల పందెం విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న మంత్రి సవిత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



వైభవంగా శ్రీరామనవమి

కనులపండువగా సీతారాముల కల్యాణం

ఉట్ల పరుష, ఎద్దుల బండ్లు, రాతిదూలం పోటీలతో సందడి

ప్రశాంతి నిలయంలో..

సీతారాముల కల్యాణోత్సవాన్ని పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో గల సాయికుల్వంత్ సభామండపంలో కనుల పండువగా నిర్వహించారు. తెలంగాణ సేవాసంస్థల ఆధ్వర్యంలో వేదపండితులు రాముడి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేశారు. అనంతరం పల్లకీ సేవను నిర్వహించారు.

ప్రశాంతి నిలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

ఊరూరా రాములోరి ఉత్సవం

పుట్టపర్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం జిల్లావ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. కనులపండువగా సీతారాముల కల్యాణోత్సవం చేశారు. ఊరూరా ఉత్సవాలు నిర్వహించారు. ఉట్లమాను, ఎద్దుల బండ్ల పోటీలతో సందడి చేశారు. ఆలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. కల్యాణోత్సవాన్ని తిలకించి, పులకించిపోయారు. భక్తుల రామనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి.


ధర్మవరంలోని రాజేంద్రనగర్ కోదండరామస్వామి ఆలయంలో నృత్య ప్రదర్శన

● గోరంట్లలోని మరవ ఆంజనేయస్వామి ఆలయం వద్ద రాతి దూలం లాగుడు పోటీలను బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ప్రారంభించారు. అదే మండలంలోని కరావులపల్లి తండాలోగల శివ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధర్మకర్త శంకర్‌లాల్‌నాయక్ ఏర్పాటు చేసిన ఎండ్లబడ్ల పరుగు పందేలను మంత్రి ప్రారంభించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథ రెడ్డి తదితరులు హాజరయ్యారు. హిందూపురంలోని సూగూరు ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉట్లపరుష కోలాహలంగా సాగింది. పెద్దఎత్తున జనం హాజరై, ఆసక్తిగా తిలకించారు.

23న అవిశ్వాసం..!

● కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా 30 మంది కౌన్సిలర్లు? ● వైసీపీలో అలజడి



కదిరి, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీషాపై అవిశ్వాస తీర్మానానికి చర్యలు మొదలయ్యాయి. ఈనెల 23న అవిశ్వాసం ప్రవేశ పెట్టనున్నట్లు అధికారులు.. కౌన్సిలర్లకు సమాచారం అందించారు. ఆ మేరకు ఆదివారం నోటీసులు అందజేసినట్లు తెలిసింది. ఈనెల 23న నిర్వహించే అవిశ్వాస తీర్మాణ సమావేశానికి హాజరుకావలని అందులో అధికారులు కోరారు. తేదీ ఖరారు కావడంతో వైసీపీలో అలజడి మొదలైనట్లు సమాచారం. చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఇప్పటికే 26 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన వినతిని కలెక్టర్‌కు సమర్పించినట్లు వ్యతిరేక వర్గం చెబుతోంది. మరో నలుగురు వ్యతిరేక వర్గంతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ నలుగురితో కలిపితే చైర్‌పర్సన్ వ్యతిరేతక వర్గం సభ్యుల సంఖ్య 30కి చేరుతుంది. అవిశ్వాసం నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలిసింది. మొత్తంమీద అవిశ్వాసానికి తేదీ ఖరారు కావడంతో వైసీపీలో అలజడి మొదలైనట్లు చర్చ సాగుతోంది. చైర్‌పర్సన్ నాలుగేళ్లుగా వార్డుల్లో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని సభ్యులు రగిలిపోతున్నారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. మున్సిపాలిటీకి వచ్చిన నిధులన్నీ చైర్‌పర్సన్‌కు అనుకూలంగా ఉన్నవారి వార్డుల్లోనే ఖర్చు పెట్టారనీ, మిగిలినవారికి మొండిచేయి చూపారని, అందుకే ఇంత వ్యతిరేకత ఉన్నట్లు చెబుతున్నారు. మున్సిపాలిటీలో అవినీతి పెరిగిపోవడం కూడా అవిశ్వాసానికి కారణంగా కనిపిస్తోంది.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పండని ఫలరాజు

తగ్గిన మామిడి దిగుబడి

పెట్టుబడులు కూడా దక్కని దుస్థితి

అప్పుల పాలవుతున్న రైతులు

బుక్కపట్నం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): తీపిని పంచే ఫలరాజు ఈ ఏడాది రైతుకు చేదు పంచాడు. జిల్లాలో మామిడి దిగుబడి దారుణంగా పడిపోయింది. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. వాతావరణంలో మార్పులతోపాటు చీడపీడలు అధికంకావడంతో ఈ సీజన్‌లో మామిడి దిగుబడి 70శాతంపైగా తగ్గిపోయింది. అకాల వర్షాలు మామిడి రైతుల ఆశలపై నీళ్లు కుమ్మరించాయి. పెట్టుబడులు తడసి మోపెడయ్యాయనీ, దిగుబడి మాత్రం దారుణంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి పంటకు బీమా చేసిన రైతులు.. ప్రభుత్వం సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

40వేల ఎకరాల్లో సాగు

జిల్లావ్యాప్తంగా మామడి విస్తారంగా సాగు చేస్తున్నారు. రకరకాల వంగడాలు పండిస్తున్నారు. ఈ ఏడాది మామిడి తోటల్లో పూతలు బాగా రావడంతో అన్నదాతల్లో ఆశలు పెరిగాయి. రోజులు తిరక్కుండానే వారి ఆశలు అడియాసలయ్యాయి. చెట్లలో పూత ఏ మాత్రం నిలబడలేదు. డిసెంబరు 15 నుంచి జనవరి మొదటి వారం వరకు తొలి విడత వచ్చింది. రెండో విడత జనవరి 20 తరువాత వచ్చింది. మొత్తం విస్తీర్ణంలో దాదాపు 95 శాతం తోటలు పూత పూసినా అది నిలువలేదు. నవతాంబ్ర, బంక తెగులు సోకడంతో పూత మొత్తంగా రాలిపోయింది. కాడలే మిగిలాయి. దీంతో 20 శాతం కూడా పూత నిలువలేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పూతను నిలుపుకునేందుకు రైతులు మామిడి తోటలకు 10 నుంచి 15 సార్లు పురుగుల మందులు పిచికారీ చేశారు. అయినా ప్రయోజనం లేదు. దీంతో పెట్టుబడి పెరిగిందే తప్ప.. తెగులు మాత్రం అదుపులోకి రాలేదు. వెరసి.. రైతులకు పెట్టుబడి కూడా దక్కక నష్టాలు మూటగట్టుకుంటున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టినా దిగుబడి రాకపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు.


మామిడి చెట్లకు మందులు పిచికారీ చేస్తున్న రైతు


పూతలు రాలిపోవడంతో బోడిగా ఉన్న మామిడి చెట్లు

ధర అంతంత మాత్రమే..

సాధారణంగా ఏ పంట అయినా దిగుబడి తగ్గితే.. ధర పెరుగుతుంది. ఈసారి మామిడి పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. దిగుబడి లేకపోయినా.. ధర పెరగకపోవడం గమనార్హం. కాయలు బాగుంటే బేనీషా టన్నుకు రూ.80వేలు ధర లభించేందనీ, ప్రస్తుతం రూ.40వేలు మాత్రమే పలుకుతుందని రైతులు చెబుతున్నారు. కాయలపై మచ్చలుంటే ఏమాత్రం ధర దక్కట్లేదని వాపోతున్నారు.

నాలుగెకరాలకు రూ.3 లక్షలు ఖర్చు: ఈశ్వరయ్య, రైతు



నాలుగెకరాల మామడి తోట ఉంది. పంటకు తెగులు సోకడంతో 10 నుంచి 15 సార్లు వివిధ రకాల మందులు పిచికారీ చేశా. రూ.3లక్షలదాకా ఖర్చు అయింది. పంట మొత్తం అమ్మినా రూ.2లక్షలు కూడా వచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడి కూడా కోల్పోవాల్సి వస్తోంది.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఐదెకరాలల మామిడి తోట కౌలుకు తీసుకున్నా. 500 మామిడి చెట్లకు పది సార్లు మందులు పిచికారీ చేశా. దిగుబడి ఆశించినంతగా రాలేదు. పెట్టుబడి రూ.2లక్షలకుపైగా పెట్టా. దిగుబడి దారుణంగా ఉంది. పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

-ఆదినారాయణ, కౌలు రైతు

వినరే.. వేమా..!

శిథిలావస్థలో గేట్లు.. పనిచేయని మోటార్లు

గేట్లు ఎత్తాలంటే అధికారులకు చుక్కలే...

గ్రీజ్‌కు కూడా పైసల్లేని దుస్థితి

యోగివేమన రిజర్వాయర్‌పై వైసీపీ నిర్లక్ష్యం

ప్రస్తుత పాలకులైనా పట్టించుకునేరా..?

సాగుపై రైతుల ఆశలు


యోగివేమన రిజర్వాయర్ (ఫైల్)

జలాశయాలను వైసీపీ పాలకులు గాలికొదిలేశారనడానికి నిలువెత్తు నిదర్శనం ముదిగుబ్బ మండలంలోని యోగి వేమన రిజర్వాయర్. ఈ జలాశయం కింద సుమారు 13వేల ఎకరాల ఆయకట్టు సాగు ఉంది. ప్రాజెక్టు మరమ్మతులకు ఏటా రూ. 20 లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. వైసీపీ హయాంలో పైసా కూడా విడుదల చేయలేదు. 5, 6, 7, 8 గేట్లు శిథిలావస్థకు చేరుకోగా.. కొన్ని మోటార్లు పనిచేయడం లేదు. దీంతో ప్రాజెక్టు నిండితే పంటలు సాగుచేసుకోవచ్చని ఆశ ఒక వైపు.. గేట్లు తెగితే ఏమవుతుందోనన్న ఆందోళన మరోవైపు రైతులను వెంటాడుతోంది. ప్రస్తుత పాలకులైనా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముదిగుబ్బ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సాగునీటికి ప్రధాన ఆధారమైన యోగివేమన రిజర్వాయర్‌పై ముదిగుబ్బ మండల రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రిజర్వాయర్‌కు నీరు వస్తే ఆయకట్టులో సాగు చేసుకోవాలని ఎదురు చూస్తున్నారు. మరోవైపు రిజర్వాయర్‌కు ఎక్కువ నీరు వస్తే ఏమవుతుందో అన్న ఆందోళన కూడా వెంటాడుతోంది. ప్రాజెక్టు పరిధిలో అభివృద్ధి పనులు, నిర్వహణ, మరమ్మతుల కోసం ప్రభుత్వం ఏటా రూ.20 లక్షల నిధులు ఇవ్వాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వంలో పైసా కూడా విడుదల కాకపోవడంతో యోగివేమన ప్రాజెక్టు పరిస్థితి అధ్వాన్నంగా మారింది. కనీసం గేట్లకు గ్రీజ్ వేసేందుకు కూడా పైసల్లేని దుస్థితి. 11 గేట్ల మరమ్మతులకు ఆయిల్, గ్రీజ్, తుప్పు పట్టకుండా రంగులు వేసేందుకు, ఇతర మరమ్మతులకు నిధులు రాకపోవడంతో 5, 6, 7, 8 గేట్లు శిథిలావస్థకు చేరాయి. 7,8 గేట్ల మోటార్లు పనిచేయలేదు. కొన్ని గేట్లకు గేర్‌వీల్స్ అలైన్‌మెంట్ పక్కకు జరిగాయి. మిగిలిన గేట్లకు కూడా మరమ్మతులు చేయాల్సి ఉంది. దీంతో నీరు లీకవుతోంది. వరద వచ్చి గేట్లు ఎత్తాల్సి వస్తే అధికారులకు చుక్కలు కనిపిస్తాయి.

గతంలో తప్పిన ప్రమాదం

2021 నవంబరులో వర్షాలకు రిజర్వాయర్‌కు భారీ వరద వచ్చింది. జలాశయంలో నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ఐదు గేట్ల ద్వారా నీటిని విడుదల చేసినా ఇన్‌ఫ్లో ప్రమాద స్థాయికి చేరుకుంది. మరో రెండు గేట్లు ఎత్తేందుకు అధికారులు ప్రయత్నించారు. రెండున్నర అడుగులు పైకి ఎత్తిన తరువాత.. అవి స్తంభించిపోయాయి. విద్యుత్ సమస్య తలెత్తడంతో పాటు, జనరేటర్ పని చేయక మూడు గంటల పాటు ప్రమాద స్థాయిలో ఐదు గేట్ల పైనుంచి వరదనీరు ప్రవహించింది. తద్వారా గేట్లు తెరుచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. 32 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఏ మాత్రం ఆలస్యమయినా గేట్లు కొట్టుకుపోయేవి. ఇంత జరిగినా వైసీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేయించలేదు. ప్రస్తుత ప్రభుత్వమయినా యోగివేమన రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేసి గేట్లు మరమ్మతులు చేయించాలని మండల వాసులు కోరుతున్నారు.

టెండర్లు పిలిచాం

యోగివేమన రిజర్వాయర్ మరమ్మతులకు టెండర్లు పిలిచాం. మెకానికల్ కాంట్రాక్ట్ అగ్రిమెంట్ పూర్తయితే పనులు ప్రారంభిస్తాం.

-కృష్ణకుమార్, జేఈ, యోగివేమన రిజర్వాయర్

లీకేజీలతో సగం నీరు వృథా



యోగివేమన డ్యామ్ గేట్లు మరమ్మతులు చేయించకపోవడంతో సగం నీరు లీకేజీల వలన వృథా అవుతున్నాయి. లీకేజీ మరమ్మతులు చేస్తే రైతులు పంటలు సాగు చేయడానికి వీలు ఉంటుంది. గేట్లు పనిచేయకపోవడంతో కిందికి నీరు వదల్లేదు. దీంతో పంటలు ఎండిపోయాయి. దీంతో చాలా నష్టపోయాం.

-తిరుమలేశ్, రైతు, దొరిగల్లు

గేట్లు కొట్టుకుపోతే మునిగిపోతాం



తుఫాన్ సమయంలో ఐదు గేట్ల ద్వారా యోగివేమన రిజర్వాయర్ నుంచి నీటిని కిందికి వదిలారు. దీంతో ఇందుకూరులోని ఎస్సీ కాలనీలోకి నీరు అధికంగా చేరాయి. గేట్లు మరమ్మతులు చేయించకపోతే, భవిష్యత్తులో నీటి ఉధృతి ఎక్కువైతే మా కాలనీ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. అధికారులు, పాలకులు చొరవ చూపి ఈ వేసవిలోనే మరమ్మతులు చేయించాలి.

-నారాయణ, ఇందుకూరు వాసి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



గేట్ల మరమ్మతులు, లీకేజీలు తదితర విషయాలపై నాయకులు, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తొందర్లోనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

-జయప్రకాష్ నాయుడు, చైర్మన్, యోగివేమన రిజర్వాయర్

హాకీకి పూర్వవైభవం తీసుకొస్తాం

మంత్రి సత్యకుమార్ యాదవ్

15వ రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): హాకీకి పూర్వ వైభవం తీసుకొస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో 15వ రాష్ట్రస్థాయి హాకీ టోర్నీని మంత్రి సత్యకుమార్ ఆదివారం ప్రారంభించారు. ముందుగా ఆయా జిల్లాల జట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. టోర్నీలో రాష్ట్రవ్యాప్తంగా 22 జట్లు పాల్గొన్నాయి. వీరిని మంత్రి పరిచయం చేసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... చదువుతోపాటు క్రీడలు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో హాకీ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంధనాధం సూర్యప్రకాశ్, కార్యదర్శి హర్షవర్ధన్, కోశాధికారి థామస్, సౌత్ రైల్వే ఆఫీసర్ గీతారెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు చిత్తు..

మొదటి రోజు ఆదివారం నిర్వహించిన పోటీల్లో పలు జట్లు గెలుపొందాయి. కాకినాడ 10-0 తేడాతో చిత్తూరును చిత్తు చేసింది. ప్రకాశం 5-0తో నంద్యాలపై, శ్రీకాకుళం 3-2తో విశాఖపట్నంపై, అన్నమయ్య జట్టు 5-0 తేడాతో మాన్యం జట్టుపై, తిరుపతి 5-0తో నెల్లూరుపై, అనకాపల్లి 2-0తో పశ్చిమ గోదావరిపై, కడప 12-0తో కర్నూలుపై విజయం సాధించాయి.



సమ్మె చేస్తున్న కార్మికులు



సమ్మెలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నేత ఓబులు

సమ్మెలోకి తాగునీటి కార్మికులు

వేతనాలు చెల్లిస్తేనే చర్చలకు వస్తాం..

సీఐటీయూ రాష్ట్ర నేత ఓబులు

కూడేరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్న అహోబిలం రిజర్వాయర్ (పీఏబీఆర్)లోని నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు వేతనాల కోసం సమ్మెబాట పట్టారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి తాగునీటి సరఫరా నిలిపివేసి, సమ్మె వేస్తున్నారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు వెయ్యి గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. సీఐటీయూ రాష్ట్ర నేత ఓబులు.. కార్మికులకు మద్దతుగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. వేతన బకాయిల కోసం తాగునీటి పథకాల కార్మికులు ప్రతిసారీ సమ్మె చేయాల్సి వస్తోందన్నారు. ఉమ్మడి జిల్లాలో 600 మంది కార్మికులు పని చేస్తున్నారనీ, వీరందరికీ ఐదు నుంచి పది నెలల వరకు వేతనాలతో పాటు, పీఎఫ్ సొమ్ము నెలల తరబడి పెండింగ్ ఉందన్నారు. గతంలో సమ్మె చేసిన సమయంలో బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ఉన్నతాధికారులు తరువాత విస్మరించారన్నారు. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల వేతన, పీఎఫ్ బకాయిలు చెల్లిస్తేనే చర్చలకు వస్తామని స్పష్టం చేశారు. అంతకు ముందు తాగునీటి పంపులు బంద్ చేసి, ఆందోళనకు దిగారు. సమ్మెలో సీఐటీయూ నాయకులు, తాగునీటి కార్మికులు పాల్గొన్నారు.

తలారి రంగయ్య కుట్రలు

ఎమ్మెల్యే ప్రలోభ పెట్టారనడం అవాస్తవం

మాజీ ఎంపీపీ తలారి తిమ్మరాజమ్మ



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ తలారి తిమ్మరాజమ్మ, ములకనూరు గోవిందు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి రంగయ్య రాజకీయంగా తమపై కుట్రలు పన్నుతూ వైసీపీని సర్వనాశనం చేస్తున్నాడని కంబదూరు మాజీ ఎంపీపీ తలారి తిమ్మరాజమ్మ, వైసీపీ బీసీ విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు గోవిందు విమర్శించారు. వారు ఆదివారం ములకనూరులో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన ఎంపీపీ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రలోభాలకు గురి చేశారని తలారి రంగయ్య చేసిన ఆరోపణలు అవాస్తవం అన్నారు. ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తే.. పార్టీ మండల కన్వీనర్‌గా నియమిస్తామని నమ్మపలికి తమను తలారి రంగయ్య నట్టేట ముంచాడని ఆరోపించారు. తమకు రాజకీయ భవిష్యత్తు లేకుండా కుట్రలకు తెరలేపుతున్నాడని విమర్శించారు. జగన్‌రెడ్డి దృష్టిలో పడాలని రంగయ్యే రాజకీయ హైడ్రామాకు తెరలేపుతూ.. కుట్రలు, కక్షలకు ఆజ్యం పోస్తున్నాడని వాపోయారు. మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ వర్గీయులమని తమను మొదటి నుంచి దూరం పెడుతున్నాడని అన్నారు. తలారి రంగయ్య మోసాలు, రాజకీయ కుట్రలను జగన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో ఆయన వచ్చినప్పటి నుంచి వైసీపీ గ్రూపు రాజకీయాలతో చిన్నాభిన్నంగా మారిపోయిందని విమర్శించారు. ఏళ్లుగా వైసీపీలో ఉన్నామనీ, తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తూ.. ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అన్నారు.

రహమత్‌నగర్‌లో హత్య

వ్యక్తిగత విషయాలపై రూమ్‌మేట్‌ల గొడవ

ఒకరిని హేళన చేసిన మరొకరు

రాయితో తలపై బాదడంతో మృతి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఓ బిర్యానీ సెంటర్‌లో పనిచేస్తున్న ముగ్గురూ మద్యం తాగారు. ఆ మత్తులో వారి వ్యక్తిగత సమస్యపై వాదులాడుకున్నారు. ఈ క్రమంలో ఒకరు మిగిలిన ఇద్దరిపై దాడి చేశారు. అందులో ఒకడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన నగరంలోని రహమత్‌నగర్‌లో జరిగింది. కోర్టురోడ్డులోని ఐటీఐ మిట్టపైన గల లింగమయ్య బిర్యానీ సెంటర్‌లో శ్రీధర్ అలియాస్ సిరి, నూర్ మహమ్మద్, గణేష్ పనిచేస్తున్నారు. శ్రీధర్ రహమత్‌నగర్ నివాసి. ఇప్పటికే శ్రీధర్ సొంత ఇంటిని అమ్మేయడంతో పాటు భార్యకు విడాకులు ఇచ్చాడు. రాప్తాడు మండలం చిన్నయనగర్‌కు చెందిన నూర్ మహమ్మద్(43)కు వివాహమైంది. బళ్లారికి చెందిన ఇరవై రెండేళ్ల కుర్రాడు గణేష్ అక్కడే పనికి కుదిరాడు. ఈ ముగ్గురూ ఒకే బిర్యానీ సెంటర్లో పనిచేస్తుండటంతో రహమత్‌నగర్‌లోని మూడోక్రాస్‌లో ఓ గది అద్దెకు తీసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ముగ్గురూ కలిసి గదిలో మద్యం సేవించారు. ఈ క్రమంలో నూర్‌మహమ్మద్.. శ్రీధర్‌నుద్దేశించి పరుషంగా మాట్లాడాడు. దీంతో శ్రీధర్ కోపంతో రగిలిపోయాడు. మధ్యలో గొడవలు పెడుతున్నాడని తొలుత గణేష్‌పైనా దాడికి దిగాడు. కొంతసేపటికి నీరు తీసుకు రావడానికి గణేష్ బయటకు వెళ్లాడు. అదే క్రమంలో శ్రీధర్ గదిలో ఉన్న ఓ పదునైన రాయితో నూర్‌మహమ్మద్ చెవిపై భాగంలో తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర రక్తగాయానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా పరారైన శ్రీధర్‌తోపాటు గణేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి



విజయరాఘవేంద్ర మృతదేహం

గుత్తిరూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దొడి గ్రామ శివారులో ఆదివారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి విజయరాఘవేంద్ర (20)అనే యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన విజయరాఘవేంద్ర ట్రాక్టర్‌కు కూలి పనికి వెళ్లాడు. గ్రామం నుంచి పొలంలోకి ఎరువును తీసుకెళ్లారు. ట్రాక్టర్ డ్రైవరు రఘు లిఫ్ట్ ఎత్తగా అది పనిచేయలేదు. దీంతో విజయరాఘవేంద్ర దానిని పరిశీలిస్తుండగా ఒక్కసారిగా ట్రాలీ మీద పడడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ..

కదిరిఅర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలేపల్లిలో ఆదివారం విద్యుదాఘాతంతో మమతమ్మ (49) మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కౌలేపల్లిలో నివాసం ఉంటున్న రామమోహన్‌రెడ్డి భార్య మమతమ్మ మిక్సీ వేస్తుండగా.. విద్యుత్ సరఫరా కావడంతో షాక్ కొట్టి కిందపడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

బొప్పాయి చెట్ల నరికివేత

ఉరవకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి చిన్నతండాలో రూపానాయక్‌కు చెందిన బొప్పాయి చెట్లను ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. రూపానాయక్ రెండు ఎకరాల్లో బొప్పాయి పంట సాగు చేశారు. పంట కాయదశలో ఉండగా సుమారు 300 బొప్పాయి చెట్లను నరికివేసినట్లు రైతు తెలిపాడు. రూ.4లక్షలు వరకూ నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు.



నరికివేసిన బొప్పాయి చెట్లు



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

అసంబద్ధ నిర్ణయాలపై

ఉద్యమిస్తాం: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్

అనంతపురం విద్య, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 117 రద్దు తర్వాత స్కూళ్ల పునర్నిర్మాణంలో అసంబద్ధ నిర్ణయాలతో తప్పు చేస్తే.. ఉద్యమిస్తామని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఆ సంఘం నాయకులు ఉపాధ్యాయభవన్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వం అప్‌గ్రేడ్ కాని ప్రాథమికోన్నత స్కూళ్లను రద్దు చేయకుండా యథావిధిగా కొనసాగించాలన్నారు. గత ప్రభుత్వంలో టీచర్లపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. టీచర్ల సీనియారిటీ జాబితాలోని తప్పులను సరిచేయాలని తెలిపారు. 117 రద్దు తర్వాత స్కూళ్ల పునర్నిర్మాణంలో అసంబద్ధ సంస్కరణలు చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కులశేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, మహమ్మద్ రఫీ, వజీర్ బాషా, అశోక్ నాయక్, నరసింహులు, రమేష్‌రెడ్డి, సూరి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

అరకు కాఫీ పొడితో బాలరాముడి చిత్రం



రామగిరి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం పేరూరు గురుకుల పాఠశాల చిత్రకళా ఉపాధ్యాయుడు శ్రీరాములు అయోధ్య బాలరాముడి చిత్రాన్ని చిత్రీకరించారు. శ్రీరామనవమి సందర్భంగా పాఠశాలలో అరకు కాఫీ పొడితో బాలరాముడి చిత్రాన్ని అపరూపంగా చిత్రించారు. ఈ చిత్రాన్ని చూసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీరాములును అభినందించారు.

రెండు బైక్‌ల దగ్ధం

అనంతపురం క్రైం,ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఇద్దరి మధ్య గొడవ నేపథ్యంలో ఓ వ్యక్తి రెండు బైక్‌లను కాల్చి వేశాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని నవోదయకాలనీకి చెందిన దూదేకుల భానుబీ, చాకలి రాజేష్‌కు పరిచయముంది. ఇద్దరూ కొన్ని రోజుల క్రితం గొడవ పడ్డారు. ఈ క్రమంలో కడప జిల్లా లింగాల మండలం మురారిచింతలకు చెందిన భానుబీ సోదరుడు మునీర్‌బాషా తన సోదరి ఇంటికి వచ్చాడు. రాజేష్, భానుబీ మధ్య మరోసారి వాగ్వాదం జరగడంతో మునీర్‌బాషా సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. అర్ధరాత్రి దాటాక మునీర్‌బాషా, భానుబీ బైక్‌లను కాల్చివేశాడు. దీంతో రాజేష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు పాపిరెడ్డిపల్లికి జగన్

- పర్యటన ఖరారు

ధర్మవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి పర్యటన ఖరారైంది. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఇటీవల జరిగిన ఘర్షణలో మృతి చెందిన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి మంగళవారం ఆయన రానున్నారు. బెంగళూరు నుంచి ఉదయం 10 గంటలకు హెలీక్యాప్టర్‌లో బయలుదేరి సీకేపల్లికి చేరుకుంటారు. 10.50 గంటలకు చెన్నేకొత్తపల్లి నుంచి రోడ్డు మార్గాన పాపిరెడ్డిపల్లికి చేరుకుంటారు. 11.10 గంటలకు వైసీపీ కార్యకర్త కురుబ లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. 12.30 గంటలకు తిరిగి బెంగళూరుకు వెళతారు.

జగన్ పర్యటనను అడ్డుకుంటాం

ఎస్సీ వర్గీకరణపై వైఖరిని ప్రకటించాలి

ఎమ్మార్పీఎస్ నేత బీసీఆర్ దాస్

అనంతపురంరూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పర్యటను అడ్డుకుంటామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బీసీఆర్ దాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర శాసనమండలిలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మద్దతు ఇవ్వాలని మందకృష్ణ మాదిగ పదేపదే కోరుతున్నారని అన్నారు. జగన్ వైఖరి చూస్తుంటే ఎస్సీ వర్గీకరణ బిల్లుపై, మాదిగల పట్ల నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. మీడియా ముందు ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మద్దతు ప్రకటించిన తరువాతే అనంతపురం రావాలన్నారు. లేకపోతే ఏమూల దిగినా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ శ్రేణులు అడ్డుకుంటాయన్నారు. జాతి లక్ష్యాన్ని, ఆత్మగౌరవాన్ని, మాదిగ అమరవీరుల ఆశయాలను నెరవేర్చుకునేందుకు ఎంతటి కష్టానికైనా సిద్ధపడతామని హెచ్చరించారు. ఇందుకు మాదిగ శ్రేణులందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

వైభవంగా రాములోరి కల్యాణం

రామనామం మార్మోగింది. జై శ్రీరామ్ అంటూ భక్తులు నినదించారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. వీధి వీధిలో భక్తులకు పానకం, వడపప్పు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.
- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


ధర్మవరంలో పూజలు చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్


కదిరిలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట దంపతులు


బుక్కపట్నం: స్వామికి హారతి పడుతున్న ఎమ్మెల్యే సింధూరా, మాజీ మంత్రి పల్లె


ముదిగుబ్బలో సీతారామ కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు


నంబులపూలకుంటలో...


గాండ్లపెంట, తాడిమర్రిలో పెండ్లి పీటలపై సీతారాముల ఉత్సవమూర్తులు


భాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు


ధర్మవరం మండలం చిగిచెర్లలో సీతారాముల ఉత్సవమూర్తుల ఊరేగింపు


బత్తలపల్లి, ధర్మవరం రూరల్ గొట్లూరులో ఉట్లమాను ఎక్కుతున్న భక్తులు


తనకల్లులో బైక్ ర్యాలీలో పాల్గొన్న యువత

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

బత్తలపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని బత్తలపల్లి, ధర్మవరం సీఐలు ప్రభాకర్, నాగేంద్ర సూచించారు. స్థానిక ఆ ర్డీటీ క్రీడామైదానంలో ఆదివారం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. పోటీల్లో నాలుగు టీంలు పాల్గొన్నాయి. వారు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అలాగే క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రమీల, గోనుగుంట్ల విజయ్‌కుమార్, అప్పస్వామి పాల్గొన్నారు.

పాడి రైతుకు ప్రోత్సాహమేదీ..?

- ప్రభుత్వ డెయిరీ ఏర్పాటు ఎన్నడో..?
- ప్రైవేటు డెయిరీని ఆశ్రయిస్తున్న పాడి రైతులు
- తుప్పుపడుతున్న యంత్రాలు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పాడి రైతులను పూర్తిగా విస్మరించింది. ప్రస్తుత ప్రభుత్వం పాడిరైతులకు ఉచిత గ్రాసం విత్తనాలతోపాటు, మినీ గోకులాలు మంజూరు చేస్తూ చేయూతనిస్తోంది. రైతులు పాలను ప్రైవేటు డెయిరీలకు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మండలకేంద్రంలో పదేళ్ల క్రితం ఉన్న ప్రభుత్వ పాలడెయిరీ మూతపడింది. అప్పటి నుంచి పాడి పరిశ్రమ తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ప్రభుత్వం పాడి రైతులకు ప్రోత్సాహమిస్తుండడంతో అభివృద్ధి చెందుతోంది. ఈతరుణంలో ప్రభుత్వ డెయిరీ లేకపోవడంతో పాడిరైతులు ప్రైవేటు డెయిరీలను ఆశ్రయించాల్సి వస్తోంది. మండల వ్యాప్తంగా పాడి రైతులు గతంలో ప్రభుత్వ పాలడైరీకి పాలు పోసేవారు. డెయిరీ మూతపడడంతో బల్కు కూలింగ్ ట్యాంక్, జనరేటర్ తుప్పుపట్టాయి. దీంతో రూ.లక్షల ప్రభుత్వ ధనం వృథాగా మారింది.

సౌకర్యాలు కరువు: ప్రస్తుతం చాలమంది రైతులు అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు సాగుచేసి, అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దీంతో రైతులు పాడిపరిశ్రమపై దృష్టి సారిస్తున్నారు. అప్పులు చేసి పాడి ఆవులతో జీవనం సాగిస్తున్నారు. వీరికి ప్రభుత్వ పరంగా మినీగోకులాలు, ఉచిత గడ్డి విత్తనాలు, పశు బీమా సౌకర్యం కల్పిస్తున్నా స్థానికంగా ప్రభుత్వ డెయిరీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అప్పట్లో పాడిరైతులకు రుణాలు ఇవ్వడంతోపాటు, పాల ధరలుకూడా ఆశాజనకంగా ఉండేవి. ఉచితంగా దాణా కూడా అందజేశారు. డెయిరీ మూత పడడంతో పాడి ఉత్పత్తికూడా తగ్గిపోయింది.




మూతపడిన ప్రభుత్వ డెయిరీ

తుప్పుపడుతున్న యంత్రాలు: మండలకేంద్రంలో పదేళ్లక్రితం ప్రభుత్వ డెయిరీని మూసివేయడంతో అప్పటినుంచి పాడి రైతులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. డెయిరీలో ఏర్పాటు చేసిన రూ.లక్షలు విలువచేసే యంత్రాలు తుప్పపట్టిపోయాయి. విద్యుత్ పోయిన సమయంలో ఏర్పాటు చేసిన జనరేటర్ కూడా తుప్పుపట్టింది.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు: ప్రభుత్వ డెయిరీని ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రైతులు ఆశపడుతున్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోగా, ప్రస్తుత ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి ప్రభుత్వ డెయిరీని ఏర్పాటు చేస్తారన్న ఆశతో పాడి రైతులు ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వ డెయిరీని తెరవాలి



గతంలో ప్రభుత్వ పాలడెయిరీ ఉన్నప్పుడు పాల ఉత్పత్తితోపాటు ధరలుకూడా ఆశాజనంగా ఉండేవి. ప్రభుత్వ డెయిరీ మూతపడడంతో చాలామంది ప్రైవేటు డెయిరీలను ఆశ్రయించాల్సి వస్తోంది. మూతపడిన ప్రభుత్వ డెయిరీని ప్రభుత్వం తిరిగితెరచి, పాడి రైతులను ఆదుకోవాలి.
-లక్ష్మీరెడ్డి, మామిళ్లకుంట్లపల్లి

సౌకర్యాలు కల్పించాలి



వరుసగా పంటలు పండకపోవడంతో చాలమంది రైతులు పాడిపైనే ఆధారపడ్డారు. ప్రభుత్వం పాడిరైతులను ప్రోత్సహిస్తోంది. పాలడెయిరీని ప్రభుత్వమే ఏర్పాటు చేస్తే మరింత అనుకూలంగా ఉంటుంది.
-రామాంజులు, నారప్పగారిపల్లి

రాములోరి సేవలో ముస్లిం

తనకల్లు, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపల్లికి చెందిన డాక్టర్ ముక్తియార్ బాషా ప్రతియేటా రాములోరి ఉత్సవాన్ని స్వగ్రామైన పెద్దపల్లిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. వ్యాపార రీత్యా బెంగుళూరులో స్థిరపడిన ఆయన ప్రతియేట శ్రీరామినవమికి గ్రామంలో సొంత నిధులతో ఉత్సవం ఏర్పాటు, నిర్వహణ, అన్నదాన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి దుస్తులునుకుడా పంపిణీ చేశారు. ఆదివారం గ్రామంలో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కర్ణాటకలోని చాకివేలు సరిహద్దు నుంచి తమ గ్రామం వరకు, అలాగే అన్నమయ్య జిల్లాసరిహద్దు కందుకూరునుంచి మల్లిరెడ్డిపల్లి వరకు ఉన్న రహదారులను ఏటా మరమ్మతులు చేయిస్తుంటారు. గ్రామంలోని ఆలయాలకు రంగులు వేయించి విద్యుత్ దీపాలంకరణతోపాటు, ఉత్సవవిగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తారు. తాను పుట్టిన ప్రాంతం అభివృద్ధికి తన వంతు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటానని ముక్తియార్ పేర్కొన్నారు. ముస్లిం అయినా రాములోరి సేవలో ఆయన చేస్తున్న కార్యక్రమాలను పలువురు అభినందిస్తున్నారు.


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ ముక్తియార్ బాషా

ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించే సంస్కృతి ప్రకాష్ రెడ్డిదే..

- వాల్మీకి సంఘం నాయకుల ధ్వజం


మాట్లాడుతున్న నాయకులు

ధర్మవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న రాప్తాడు నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించి కులాల మధ్య చిచ్చుపెట్టే సంస్కృతి నీదని, పరిటాల కుటుంబానిది కాదని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై టీడీపీ వాల్మీకి సంఘం నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక గాంధీనగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బొట్టుకిష్ట, నాయకులు సాయి, నరసింహులు, మాట్లాడారు. పాపిరెడ్డిపల్లిలో జరిగిన చిన్నగొడవలో కురుబ లింగమయ్య చనిపోతే దానికి ఫ్యాక్షన్ అంటగడుతూ కులాల మధ్య చిచ్చుపెట్టడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిటాల కుటుంబం గెలిచినా, ఓడినా పార్టీ కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటూ వారి సమస్యలపై పోరాడారన్నారు. కుల రాజకీయాలు మానుకోవాలని లేదంటే బీసీలే తరిమికొట్టే పరిస్థితులు తెచ్చుకోవద్దని ప్రకాష్‌రెడ్డికి హితవు పలికారు.

ఎక్స్‌కవేటర్‌కు నిప్పు

ధర్మవరంరూరల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఓబుళనాయునిపల్లి సమీపంలో ఓ కొండలో మట్టి తోడుతున్న ఎక్స్‌కవేటర్‌కు శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు ధర్మవరం పట్టణవాసి కిషోర్‌కి చెందిన ఎక్స్‌కవేటర్ శివ అనే వ్యక్తికి లీజుకు ఇచ్చాడు. వీరు ఓబుళనాయునిపల్లి సమీపంలోని ఓ కొండలో మట్టిని టిప్పర్లకు వేసేందుకు బాడుగకు వెళ్లి దానిని అక్కడే ఉంచి ఆపరేటర్, హెల్పర్ ఇంటికి వెళ్లిపోయారు. శనివారం అర్ధరాత్రి కొండవద్ద ఉన్న ఆ హిటాచీకి నిప్పుపెట్టడంతో మిషన్‌లో ఉన్న పరికరాలన్నీ కాలిపోయాయి. ఆదివారం ఉదయం అక్కడికి వెళ్లగా చూడగా ఎక్స్‌కవేటర్ కాలిపోవడంతో రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జూదరుల అరెస్టు

ధర్మవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని లక్ష్మీనగర్ సమీపంలో రైల్వేట్రాక్ వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు వారి వద్ద నుంచి రూ.10,200 స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప ఆదివారం తెలిపారు. రైల్వేట్రాక్ వద్ద ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో సిబ్బంది బాలాజీ, విశ్వనాథ్, అబ్దుల్ దాడులు చేసి వారిని అరెస్టు చేశామన్నారు.

విధులకు డాక్టర్ డుమ్మా..!

- ప్రభుత్వ సెలవు దినాల్లోనూ అంతే..
- పట్టించుకోని ఉన్నతాధికారులు

బుక్కపట్నం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆదివారం డాక్టర్ విధులకు డుమ్మాకొట్టారు. ఒకటిరెండు రోజులు కాకుండా గత కొన్ని సంవత్సరాలుగా ఈ తంతు కొనసాగుతున్నా, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఆస్పత్రికి వచ్చే రోగులు కూడా ఆదివారం నిజంగా ప్రభుత్వ సెలవని నమ్ముతుండడం విశేషం. ఆదివారంతోపాటు ప్రభుత్వ సెలవు రోజుల్లో ఆసుపత్రికి డాక్టర్ రావడంలేదని రోగులు చెబుతున్నారు. విధులకు వచ్చినరోజు కూడా మధ్యాహ్నం వరకు ఉండి వెళ్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఆదివారం డాక్టర్ రాకపోవడంతో విధుల్లో ఉన్న నర్సు మాత్రమే వచ్చిన రోగులకు మాత్రలు ఇచ్చి పంపించారు. డాక్టర్ సెలవుపెట్టకుండా విధులకు డుమ్మాకొట్టి, మరుసటిరోజు వచ్చిన సమయంలో హాజరపట్టికలో సంతకాలు పెడుతున్నట్లు సమాచారం. రెండుమూడురోజులు విధులకు రాకపోయినా, తరువాత రిజిస్టర్‌లో వచ్చినట్లు సంతకాలు పెడుతున్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి నిధులు గోల్‌మాల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వాహణ ఖర్చులకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం రూ.1.75 లక్షలు నిధులు మంజూరు చేస్తుంది. ఈ నిధులను ఆస్పత్రి అభివృద్ధికి ఖర్చు పెట్టకుండా సొంతానికి సదరు డాక్టర్ వాడుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. నకిలీ బిల్లులు పెట్టి ప్రతియేడాది నిధులు స్వాహాచేస్తున్నట్లు తెలుస్తోంది.


ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ

విచారించి, చర్యలు తీసుకుంటాం: ఫిరోజ్‌బేగం, జిల్లా వైద్యాధికారి

బుక్కపట్నం పీహెచ్‌సీలో డాక్టర్ విధులకు డుమ్మాకొడుతున్న విషయం తన దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


పుట్టపర్తిలో జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): జిలా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు మాట్లడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. ప్రపంచంలోని ఐదవ ఆర్థిక శక్తిగా ప్రస్తుతం భారత దేశం ఉందన్నారు. అనంతరం కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మీదుగా బైక్ ర్యాలీ చేశారు. రాష్ట్ర కల్లుగీత ఫెడరేషన్ కన్వీనర్ హరిక్రిష్ణగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండమరాజు, మీడియా కన్వీనర్ జ్యోతిప్రసాద్, కోశాధికారి సురేంద్రబాబు, సునిల్, కళ్యాణకుమార్, బాలగంగాధర్, రామాంజనేయులు, ధనుంజయరెడ్డి, చెన్నప్ప, భాస్కర్‌రెడ్డి, మధు, నారాయణస్వామి పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పలువురు మాట్లాడుతూ పార్టీ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. రొద్దం ఉత్తమరెడ్డి, సుదర్శన్, కుటాగుళ్ల వెంకటేశ్, శరత్‌కుమార్‌రెడ్డి, జెట్టి ఆంజనేయులు, నందిశెట్టిబాబు, డీఎల్ ఆంజనేయులు, గిరిజమ్మ, నాగార్జున, హరినాయక్, మైనోద్దీన్, ఆనంద్ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కన్వీనర్ వీరాంజి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట పార్టీ జెండాను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసులు, సున్నంపల్లి రంగారెడ్డి, మేకల వెంకటరమణ, అశ్వత్థప్ప, రాజశేఖర్, ఆకుతోటపల్లి క్రిష్టప్ప, రాజు పాల్గొన్నారు.

తనకల్లు: మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ చేపడుతున్న సంక్షేమపథకాలను వివరించారు. జిల్లా అధ్యక్షులు శేఖర స్వామి, బీజేవైఎం అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, సురేష్‌గోపి, నరేష్, శ్రీనాథ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు కేశవరెడ్డి, మైనార్టీ అధ్యక్షులు ఇంతియాజ్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదట కేక్ కట్‌చేసి కార్యకర్తలు సంబరాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, అంజన్‌రెడ్డి, గొడుగు అమీర్, ఫణీంద్ర గౌడ్, కూడేరు రాము, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.


కదిరిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

న్యూస్ బాక్స్

ప్రతి హామీని నిలబెట్టుకుంటాం

- మంత్రి సత్యకుమార్ యాదవ్


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని గూడ్స్‌షెడ్‌కొట్టాలలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రి పార్టీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రారంభంలో లోక్‌సభలో కేవలం రెండు సీట్లతో ప్రయాణం మొదలై అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ప్రజల విశ్వాసంతో వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారాన్ని దక్కించుకుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజలకుఅవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. చేనేత కార్మికుల రుణం తీర్చుకునే విధంగా మెగాహ్యాండ్‌లూమ్‌క్లస్టర్ మంజూరు చేశామని, వాటి కోసం స్థలాన్ని కూడా సేకరించామన్నారు. త్వరలో పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జింకా చంద్ర, సాకే ఓబుళేశు, నబీరసూల్, కృష్ణాపురం జమీర్ అహమ్మద్, డోలారాజారెడ్డి, బిల్లేశీన,ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్, మహిళా నాయకురాలు కంచం లీలావతి పాల్గొన్నారు.

వేమన ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో వేమన సమాధి

గాండ్లపెంట, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లిలో శ్రీయోగివేమన ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కుంభం పోసే కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఉదయమే స్వామివారికి జొన్నలు సమర్పించారు. వాటిని ఉడికించి, కుంభం పోస్తారు. దానిని ఇళ్లలో ఉంచుకుంటే పశువులకు రోగాలు, పంటలకు చీడపీడలు సోకవని ప్రజల నమ్మకం. యువత పోటీపడి కుంభం తీసుకుంటారు. పలువురు భక్తులు వేమనకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గాండ్లపెంట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కదిరి-రాయచోటి రోడ్డులో వ్యవసాయ కార్యాలయం వద్ద టాటా మ్యాజిక్, ద్విచక్రవాహన్ని ఆదివారం ఢీకొంది. ఈప్రమాదంలో మోహన్‌రెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎన్పీకుంట మండలం మేకలచెరువు నుంచి జయ రాం టాటా మ్యాజిక్‌లో గాండ్లపెంట మండలం కటారుపల్లిలో జరుగుతున్న వేమన ఉత్సవాలకు వెళ్తున్నారు. ఎన్పీకుంట మండలంలోని ధనియాన్‌చెరువుకు చెందిన మోహన్ శ్రీరామినవమి పండుగకు పూజాసామాగ్రిని కదిరినుంచి స్వగ్రామానికి తీసుకెళ్తున్నారు. గాండ్లపెంట వ్యవసాయ కార్యాలయం వద్ద ద్విచక్రవాహనాన్ని టాటా మ్యాజిక్ ఢీకొనడంతో మోహన్‌రెడ్డి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన అతడిని 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించినట్లు తెలిపారు.

మూడు ఆవుల మృతి

ముదిగుబ్బ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాతవూరిలో కడుపు ఉబ్బరంతో మూడు ఆవులు ఆదివారం మృతి చెందినట్లు పశువైద్యాధికారి రామేశ్వరరావు పేర్కొన్నారు. పాతవూరికి చెందిన జన్నిపల్లి రాజా ఆవుల పెంపకంతో జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం పొలంలోకి మేపునకు తీసుకెళ్లి ఇంటికి తీసుకువచ్చి ఆవులు నీరు అధికంగా తాగడంతో కడుపు ఉబ్బరంతో క్రిందపడి మూడు ఆవులు మరణించాయన్నారు. మరో రెండు ఆవుల పరిస్థితి విషమంగా ఉందని, రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. మండల పశు వైద్యాధికారి రామేశ్వర్రావు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి, పరిశీలించి మిగతా ఆవులకు చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర రైతు కార్యదర్శి రమేష్‌బాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమల ప్రకాష్ సంఘటనా స్థలానికి వెళ్ళి బాధితులను పరామర్శించి, ప్రభుత్వం ద్వారా సహాయం అందించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అనారోగ్యంతో విద్యార్థిని..

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటివారిపల్లి ప్రభుత్వ పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ ఉషా, రాము దంపతుల కుమార్తె వైష్ణవి (7) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. విద్యార్థిని కొక్కంటి వారిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 2వతరగతి చదువుతోంది. విద్యార్థినికి జ్వరంతోపాటు, ఫిట్స్ రావడంతో ఇటీవల చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్ తెలిపారు. విద్యార్థిని మృతిపట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వెంకటరమణ సంతాపం వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

క్రికెట్ విజేత అగళి-ఎ జట్టు



షీల్డ్ అందుకుంటున్న విజేత జట్టు

అగళి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఏపీఎల్ జూనియర్ ప్రీమియర్ లీగ్ విజేతగా అగళి-ఎ టీం నిలిచినట్లు ఆర్గనైజర్ బాషా, ఉదయ్, నంద, మంజునాథ్ తెలిపారు. టోర్నీలో ఆరు జట్లు పాల్గొనగా అగళి-ఎ టీం విజేతగా నిలిచింది. విన్నర్స్‌కు రూ.4వేలు, రన్నరప్‌కు రూ.2వేలు, మూడో బహుమతి రూ.వెయ్యి, షీల్డ్‌లు అందజేశారు.

14 మందితో మార్కెట్ యార్డు కమిటీ

మడకశిరటౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మడకశిర మార్కెట్ యార్డు కమిటీని సీఎం ప్రకటించినట్లు కమిటీ ఛైర్మన్ గురుమూర్తి ఆదివారం తెలిపారు. 14 మందితో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తూ ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీదేవి, కమిటీ సభ్యులుగా సునీతమ్మ బద్రి, ఎం.వి.రమేష్‌బాబు, ఫయాజ్, కనుమ, భాగ్యమ్మ, మీనాక్షి, శివరాములు, శిల్ప, రత్నశ్రీ, విరూపాక్షప్ప, శ్రీనివాస్, జయన్న, గౌరమ్మను నియమించినట్లు తెలిపారు. నియమితులైన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



గోరంట్లలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గోరంట్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్ ఆధ్వర్యంలో పార్టీనాయకులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టి ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బోయ లక్ష్మీనారాయణ, శంకర్‌రెడ్డి, నాగరాజుయాదవ్, ఈశ్వర్‌రెడ్డి, శంకర్, గంగాధర్, ముంతాజమ్మ, అంజనేయులు, హరీష్, నరేష్, అశోక్, రామాంజనమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మడకశిరటౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలను ఆదివారం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం, మండల కన్వీనర్ రామదాసు, జనరల్ సెక్రెటరీ జగదీష్ తదితరులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

పరిగి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గ బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి పరిగి వేణుగోపాల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోది ఆశయాలతో బీజేపీ పల్లెపల్లెల్లో విస్తరిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ మూర్తి, నాయకులు కిష్టప్ప, శివకుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మడకశిర, గోరంట్లలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు.

ఘనంగా గంధంపూజ



ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

పెనుకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గోనిపేట రోడ్డులో వెలసిన షేక్‌సయ్యద్‌షా ఖ్రముద్దీన్‌బాబా ఆలయంలో స్వామివారి గంధంపూజ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంక్యూఏ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహ్మదీయ మత గురువులతోపాటు హిందూ, ముస్లిం, క్రైస్తవ, సూఫీ మతస్థులు పాల్గొన్నారు. ఊరేగింపుగా గంధాన్ని దర్గాకు తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. అనంతరం చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి హాజరైన వివిధ ప్రాంతాల వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ కలీముల్లా, అక్రంఖాన్, ఆదిల్, నరేష్, అయూబ్‌ఖాన్, మతపెద్దలు, పాల్గొన్నారు.

లేపాక్షిలో గ్రామదేవత ఊరేగింపు

లేపాక్షి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రసిద్ది చెందిన అతిపురాతన గ్రామదేవత గొంగటిపల్లి ముత్యాలమ్మ ఆదివారం లేపాక్షిలో ఊరేగించారు. ప్రతి యేడాది ఉగాది పండగ ముగిసిన తరువాత లేపాక్షి గ్రామంలో అమ్మవారిని ఊరేగించడం ఆనవాయితీ. దీంతో ఆదివారం గ్రామస్థులు అమ్మవారిని ఊరేగించారు. పలువురు భక్తులు దర్శించుకుని తమ మొక్కులుతీర్చుకన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

హిందూపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని సూగూరు సడ్లపల్లిలో వెలసిన పురాతనమైన ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పలువురు విరాళాలు అందించారు. ఆలయ కమిటీసభ్యులు దివంగత సావిత్రమ్మ కుటుంబ సభ్యులు రూ.లక్ష, సడ్లపల్లి విద్యాగణపతి సేవా సమితి బృందం సభ్యులు రూ..1,23,456, హౌసింగ్ బోర్డులో నివాసమున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు శరబయ్య రూ.10వేలు అందించారు. శ్రీరామనవమి సందర్భంగా విరాళాలు అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జూదరుల అరెస్టు

ధర్మవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్ సమీపంలో రైల్వేట్రాక్ వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు వారి వద్ద నుంచి రూ.10,200 స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప ఆదివారం తెలిపారు. రైల్వేట్రాక్ వద్ద ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో బాలాజీ, విశ్వనాథ్, అబ్దుల్ దాడి చేసి వారిని అరెస్టు చేశామన్నారు.



సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



కల్యాణోత్సవం అనంతరం సీతారాములు ఉత్సవ విగ్రహాలు

కమనీయం.. సీతారాముల కల్యాణం



మిట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరాముడి విగ్రహం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణం వైభవంగా సాగింది. పట్టణ పరిధిలోని స్వయంభూగా వెలిసిన ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం కల్యాణ వేడుకలు కమనీయంగా సాగింది. వేదపండితుల మంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాలతో నడుమ శాస్త్రోక్తంగా జరిగింది. కల్యాణోత్సవం అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. జై శ్రీరాం నినాదాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. ఆంజనేయస్వామి మూలవిరాట్‌ను బంగారు ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. దండురోడ్డులోని 27 అడుగుల ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి.

కోలాహలంగా ఉట్లపరుష

పట్టణ పరిధిలోని సూగూరు ఆయంజనేయస్వామి దేవాలయం, దండురోడ్డులోని బైలాంజనేయ ఆలయం, మోడల్ కాలనీలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణాల్లో ఉట్లపరుష కోలాహలంగా జరిగింది.వేలాది మంది భక్తులు ఉట్లపరుషను తిలకించారు. అదేవిధంగా లంకాదహన కార్యక్రమం ఆకట్టుకుంది.

నీలకంఠాపురంలో...

మడకశిర రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠాపురంలోని రాముని ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయకమిటీ ఛైర్మన్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి శ్రీరాముడి పాదుకలను తలపైన పెట్టుకొని ఆలయంలో ప్రదక్షిణలు చేశారు అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీరామభద్రాలయం, దక్షిణముఖ ఆంజనేయస్వామి, వజ్రముష్టి ఆంజనేయస్వామి, ఊరువాకిలి ఆంజనేయస్వామి, మట్ట ఆంజనేయస్వామి, రామమందిరాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయంలో రామేశ్వరంలో రాముడు నిర్మించిన సేతువుకు సంబంధించిన రామశిలను నీటి తొట్టిలో ఉంచి అది నీటిలో తేలుతున్న దృశ్యాన్ని భక్తులకు ప్రదర్శించారు.

నేడు బ్రహ్మరథోత్సవం

కోడూరులోని కోదండ రాముడి బ్రహోత్సవాల్లో సోమవారం బ్రహ్మరథోత్సవం ఉంటుందని సర్పంచ్ మురళి మోహన్ తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు స్వామి వారిని రథంపై ఆశీనులను చేసి రథోత్సవం నిర్వహిస్తామన్నారు.

రామాయణంలోని నీతిని ఆచరించాలి
- మంత్రి సవిత

గోరంట్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాముని మించిన దేవుడు లేడు.. సీతను మించిన ఇల్లాలు లేదని రామాయణంలోని నీతిని ప్రతి ఒకరు భావితరాలకు నేర్పాలని మంత్రి సవిత అన్నారు. ఆదివారం గోరంట్లలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై మంత్రి మాట్లాడారు. తల్లిదండ్రులు, పెద్దలను ఏవిధంగా గౌరవించాలి, అన్నదమ్ముల మధ్య సఖ్యత తదితర అంశాలను రామాయణ కథాసారాంశంగా నేర్చుకోవాలన్నారు. అనంతం జరిగిన రాతి దూలం లాగుడు పోటీల్లో కడప జిల్లా వేములకు చెందిన వీరాంజనేయులు వృషభాలు ప్రథమ బహుమతి పొందాయి. రూ.25వేలు వారికి అందజేశారు. మేడాపురం వెంకటేష్ వృషభాలు ద్వితీయ బహుమతి రూ. 15వేలు, సీకెపల్లి నాగరాజు వృషభాలు తృతీయ బహుమతి రూ.10వేలును మంత్రి చేతులమీదుగా అందుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రఘునాథరెడ్డి, గుజరాత్ ఇన్‌కంట్యాక్స్ అధికారి వీరభద్రుడు, న్యాయాధికారి రామకృష్ణుడు, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డిఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్ తదితరులు హాజరైయ్యారు. కాగా ఎడ్లబండ్ల పరుగుపందెంలో అపశృతి చోటు చేసుకుని పలువురికి గాయాలయ్యాయి. నిడిమామిడికి చెందిన రైతు సూర్యనారాయణ బండి బోల్తా పడినా, ఆయన స్వల్పగాయాలతోబయటపడ్డారు. మరో బండి ఐదు అడుగు ఇనుప బారీకేడ్లను ఎగురి ప్రజలపైపు దూసుకెళ్లడంతో పోలీసులు సైతం పరుగులు తీశారు. మరో బండి జనంపైకి దూసుకెళ్లడంతో గోరంట్లకు చెందిన నూర్ మహమ్మద్, గోపిదేవర పల్లికి చెందిన చెన్నకేశవులు తీవ్రవంగా గాయపడ్డారు. వారిని 108లో గోరంట్ల, హిందూపురం ఆసుపత్రులకు తరలించారు.



మడకశిరలో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ



హిందూపురంలోని సూగూరు ఆంజనేయస్వామి..



అగళిలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో పెనుకొండ ఊరువాకిలి ఆంజనేయస్వామి



దక్షిణముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం



రథోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్



పరిగిలో స్వామివారి ఉత్సవం



నీలకంఠాపురంలో శ్రీరాముడి పాదుకలు మోస్తున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి



పెనుకొండ మండలం పెద్దచెరువుకట్ట వద్ద ఉట్లపరుష



కోడూరు తోపులో రామాలయంలో పూజలు



ఎడ్లబండ్ల పోటీ



పరుగు పందెంలో బోల్తాపడిన ఎడ్లబండి

జీవితాలు ముక్కలు..!

పండుగ మాటున జోరుగా జూదం
గ్రామాల్లో పట్టపగలే పేకాట... పట్టించుకోని పోలీసులు

చిలమత్తూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గతంలో ఉగాది పండుగ రోజున గ్రామాల్లో కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలు, వరసైన వారు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకోవడం, కుస్తీ పోటీలు, ఉయ్యాల ఊగడం వంటివి చేస్తూ ఎంతో ఆహ్లాదంగా గడిపేవారు. ప్రస్తుతం ఆ వాతావరణం ఎక్కడా కనపడలేదు. పండుగరోజు సరదాలు, సాంస్కృతిక కార్యక్రమాల కంటే గ్రామాల్లో జూదాలు పెద్ద ఎత్తున నడుస్తున్నాయి. గతంలో పండుగ రోజు ఏదో కాలక్షేపం కోసం జూదం ఆడేవారు. అది ఆ ఒక్కరోజు మాత్రమే. ఇప్పుడు ఉగాది అంటే పేకాట అనే స్థాయికి వెళ్లిపోయింది.

గ్రామాల్లో పట్టపగలే...

గ్రామాల్లో పండగ ముగిసినా జూదం మాత్రం యథావిధిగా సాగుతోంది. పట్టపగలే గ్రామాల్లో నడిబొడ్డున కూర్చొని పేకాట ఆడుతూ లక్షల రూపాయలను ఒడ్డుతున్నారు. మండలంలో కొన్ని గ్రామాలు జూదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఇక్కడ జూదాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని తెలిసి కర్ణాటక నుంచి జూదరులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా పండుగ పేరుతో జూదాలు నడుస్తూనే ఉన్నాయి. ప్రధానంగా యువకులు అత్యాశకు వెళ్లి వేల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. గ్రామాల నుంచి బెంగళూరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన యువకులు సైతం ఏడాదంతా సంపాదించిన సొమ్మును ఇప్పుడు ఉగాది పండుగ పేరుతో సొంత ఊరికి వచ్చి మాయ జూదంలో పోగొట్టుకుంటున్నారు. దీంతో ఆయా కుటుంబాల్లో గొడవలు కూడా ప్రారంభమయ్యాయి. అనేకమంది జీవితాలు నాశనం అవుతున్నాయి.



కోడూరు సమీపంలో నిర్వహిస్తున్న పేకాట

చేతులు మారుతున్న లక్షలు

పండుగ ముందు రోజు, పండుగ రోజునే లక్షల రూపాయలు చేతులు మారాయని తెలుస్తోంది. ఒక్క ఆటలో రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు పందెం ఒడ్డుతున్నట్లు సమాచారం. ఇలా ఒక్క ఆటలో పది మంది కూర్చొంటే రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు కేవలం పది నిమిషాల్లో చేతులు మారుతున్నాయి. ఇలాంటి జూద కేంద్రాలు ఒక్కో గ్రామంలో నాలుగైదు జరుగుతున్నట్లు సమాచారం.

చోద్యంచూస్తున్న పోలీసులు

ఉగాది పండుగ పేరుతో పట్టపగలే గ్రామాల్లో జూదాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. సాధారణ రోజుల్లో సైతం గ్రామాల్లో జూదాలు జోరుగా సాగుతున్నాయి. అది పండుగ పేరుతో మరింత పెరిగింది. ఈ జూదం పెరిగే కొద్దీ గ్రామాల్లో కొత్త కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. జూద కేంద్రాలపై పోలీసులు నిఘా పెట్టి, అరికట్టాల్సిన అవసరం ఉంది.

పండుగ వేళ విషాదం

ఆలయ పైభాగంలో పూలమాల వేస్తూ జారిపడి మృతి

చిలమత్తూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగ సందర్భంగా కనిశెట్టిపల్లిలో విషాదం నెలకొంది. గ్రామంలో వెలసిన శ్రీరామాలయంలో అలంకరణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు గుడిపై భాగం నుంచి కింద పడిపోవడంతో లక్ష్మినారాయణ (40) మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కనిశెట్టిపల్లిలో ఉన్న రామాలయంలో పండుగ సందర్భంగా ఆలయాన్ని అలంకరిస్తున్నారు. ఈ తరుణంలో లక్ష్మినారాయణ గుడి పైభాగాన ఉన్న విగ్రహాలకు పూలమాల వేయడానికి పైకి ఎక్కాడు. గుడి ముందు భాగంలో ఏర్పాటుచేసిన పందిరిపై కాలుమోపడంతో కాలుజారి కిందపడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆలయ నిర్మాణంలో లక్ష్మినారాయణ కూలిగా పనిచేశాడని, ఇలా పండగపూట అదే ఆలయానికి పూలు అలంకరిస్తూ ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మండే ఎండలో వంట..

సోమందేపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు అన్నం వండటానికి ఆశావర్కర్లు నానా తంటాలు పడుతున్నారు. ఆసుపత్రికి ఆరోగ్యపరీక్షల కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చే గర్భిణీలకు ఆసుపత్రి ఆవరణంలోనే పౌష్టికాహారాన్ని వండి వడ్డిస్తుంటారు. ఆసుపత్రి ఆవరణంలో ప్రహరీకి ఆనుకుని పొయ్యి ఏర్పాటుచేసుకుని ఆరుబయట వండుతున్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆశ వర్కర్లు గాయత్రి, మల్లీశ్వరి, భారతి, అశ్విని తెలిపారు. పిచ్చి మొక్కలు అధికంగా ఉండటంతో పాముల బెడద ఉందన్నారు. సౌకర్యాలు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇప్పటికైనా తమకు సౌకర్యాలు కల్పించాలని కోరారు.



మండుటెండలో వంట వండుతున్న ఆశావర్కర్లు

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం
: మంత్రి సవిత



సమస్యలను మంత్రికి వివరిస్తున్న బ్రాహ్మణపల్లి ముస్లింలు

పెనుకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ముస్లింలు మంత్రిని కలిసి గ్రామంలోని సమస్యలు, ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రితో చర్చించారు. మంత్రి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి, ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందన్నారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ఐదుగురి అరెస్ట్

హిందూపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదుచేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. లేపాక్షి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రామాచారి, తూముకుంట పారిశ్రామికవాడకు చెందిన సమోద్‌కుమార్, శివివరానికి చెందిన తిప్పన్న, గలిబిపల్లికి చెందిన రామలక్ష్మీ, మేళాపురం లక్ష్మీ కర్ణాటక నుంచి మద్యాన్ని తీసుకొస్తున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని వారివద్ద మద్యం స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా లైసెన్స్‌లేకుండా కల్లు విక్రయిస్తున్న వారిపై కూడా కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

డ్రిప్, షెడ్డు అగ్నికి ఆహుతి
- రూ.2లక్షల ఆస్తినష్టం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మల్బరీ షెడ్డు, డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. బాధితుడు రాజు తెలిపిన వివరాల మేరకు వ్యవసాయ పొలంలో పంట కోతకోసి అక్కడే ఉంచాడు. పక్కనే ఉన్న మరో రైతు మల్బరీషెడ్డులో ఉన్న ఎండుగడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగాయి. షెడ్డుతోపాటు ఫ్యాన్‌లు, డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరాడు.



కాలిపోయిన డ్రిప్ పరికరాలు